క్లుప్తంగా

వైద్య శిబిరాలతో పేదలకు మేలు

కేతిరెడ్డిపల్లి గొడుగు వసంతయాదయ్య



కేతిరెడ్డిపల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

మొయినాబాద్‌రూరల్: వైద్య శిబిరాలతో పేదలకు మేలు జరుగుతుందని కేతిరెడ్డిపల్లి సంఘ సేవకుడు గొడుగు వసంతయాదయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం మెగా మల్టీ స్పెషాల్టీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గొడుగు వసంతయాదయ్య మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సామాజిక సేవలో పాల్గొనాలని ఆయన అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వైద్యుల సహకారంతో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు.

మల్‌రెడ్డి విజయం శుభపరిణామం



కాంగ్రెస్ నాయకులకు స్వాగతం పలుకుతున్న సంజీవ

మంచాల: ఎమ్మెల్యేగా మల్‌రెడ్డి రంగారెడ్డి గెలుపొందడం శుభ పరిణామమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సంజీవ అన్నారు. మల్‌రెడ్డి ఎన్నికల్లో గెలుపొందడంతో ఆదివారం లోయపల్లి గ్రామం నుంచి కాంగ్రెస్ నాయకులు దాస్‌గౌడ్, వెంకటేశ్ పాదయాత్రగా వెళ్లి ఇబ్రహీంపట్నంలోని కట్టమైసమ్మ ఆలయం మొక్కుతీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు చేతాళ్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బాటసింగారంలో క్రికెట్ పోటీలు



మైదానంలో క్రీడాకారులు

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రతి ఏటా సంక్రాంతికి ముందుగా నిర్వహించే క్రికెట్ పోటీలు ఆదివారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం గ్రామంలో ప్రారంభమయ్యాయి. బీపీఎల్ -4 (బాటసింగారం ప్రీమియం లీగ్) టోర్నమెంట్‌ను స్థానిక సర్పంచ్ లతాశ్రీ, ఎంపీటీసీ వెంకటేశ్, కో–ఆప్షన్ సభ్యుడు గౌస్ పాష, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ధన్‌రాజ్‌గౌడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఏసూరి రాజు, అశోక్, సాయిచంద్, సరిపల్లి నవీన్, మహేశ్, రవి, సందీప్, యువకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



యాదయ్యగౌడ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కసిరెడ్డి

తలకొండపల్లి: మండల పరిధిలోని వెంకటపూర్‌కు చెందిన కల్వకుర్తి జేపీసీ అధ్యక్షుడు సదానందంగౌడ్ తండ్రి యాదయ్యగౌడ్ ఇటీవల మరణించాడు. ఆదివారం దశదినకర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి వెంకటాపూర్‌కు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. యాదయ్యగౌడ్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్, సర్పంచ్ రమేశ్‌యాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించండి

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విద్యానగర్ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎం.ఎ. పాషా కోరారు. ఆమనగల్లు పట్టణంలోని లిటిల్‌స్కాలర్స్ టెక్నో హైస్కూల్ ఆవరణలో ఆదివారం విద్యానగర్ కాలనీ సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాషా మాట్లాడుతూ కాలనీలో కనీస వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. నీటి సౌకర్యం, సీసీ రోడ్లు వేయాలని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలని, వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి జంగయ్య, కోశాధికారి సుదర్శన్‌రెడ్డి, సభ్యులు పాండు, పత్యానాయక్, వెంకటేశ్వర్‌రెడ్డి, పర్వతాలు, ఆరీఫ్, రమేశ్, రాఘవాచారి, మల్యానాయక్, తావుర్యానాయక్, సురేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వామ్మో.. చలి

వణికిస్తున్న ఉష్ణోగ్రతలు | చిన్నపిల్లలు, వృద్ధుల ఇబ్బందులు | అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన



షాబాద్: మారుతున్న వాతావరణానికి తోడు చలి వణికిస్తోంది. ఈ చలికి బయటికి వెళ్లాలంటే వామ్మో..చలి అంటున్నారు జనం. తెల్లవారుజామున జనం బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ఉదయం ఎనిమిది గంటల వరకు కూడా చలి ప్రభావం ఉంటుంది. ఇక సాయంత్రం ఏడు అయితే చాలు చలి గాలుల ప్రభావం కనిపిస్తుంది. పది రోజులుగా చలి తీవ్రత పెరిగింది. దీర్ఘకాలిక రోగులకు ఇబ్బందికరంగా మారింది. దీనికి తోడు సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. జలుబు, దగ్గు, గొంతునొప్పి, ఫ్లూ, జ్వరం, ఆయాసం వంటి కేసులు పెరుగుతున్నాయి. అస్తమా, సీఓపీడీ, అలర్జీ, నిమోనియా, తదితర శ్వాసకోశ వ్యాధులు ఉన్న వారు మరింత ఇబ్బంది పడుతున్నారు. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిపై వైరస్ ప్రభావం చూపుతుందని వైద్యులు చెబుతున్నారు.

వాతావరణ మార్పులతో సమస్యలు

శీతల వాతావరణంలో అలర్జీ ఎక్కువగా ఉన్నవారు బ్రాంకైటిస్ బారినపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వైరస్ శక్తి వంతమవుతుందని వైద్యులు చెబుతున్నారు. దగ్గు, ఆయాసం శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తున్నాయి. ఐదు నుంచి ఆరు రోజుల్లో తగ్గే జబ్బు, అలర్జీ ప్రస్తుతం రెండు వారాలు ఉంటుందని పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

పొడిబారుతున్న చర్మం

చల్లటి గాలులకు చర్మం పొడిబారుతోంది. పెదవులు పగిలి ముఖం కాంతిహీనంగా మారుతోంది. అరికాళ్లు పగిలి ఇబ్బంది పడుతున్నారు. శరీరంలో తేమ శాతం తగ్గిపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడుతుంది.

నిర్లక్ష్యం వహిస్తే..

అస్తమా, నిమోనియా, సీఓపీడీ, గుండె వ్యాధులతో బాధపడేవారికి చలికాలం కష్టకాలమని వైద్యులు పేర్కొంటున్నారు. చల్లటి ఆహారం తీసుకున్నా, ఏసీ గదుల్లో ఉన్నా అస్తమా పెరుగతుందని వైద్యులు చెబుతున్నారు. నిర్లక్ష్యం వహిస్తే ఇన్‌ఫెక్షన్ అయ్యే ప్రమాదముంది. వైద్యం ఆలస్యమైతే క్రమేణా ఊపిరితిత్తుల్లోకి నీరు చేరుతుంది. దీంతో ఊపిరితిత్తుల్లోని పొరలు ఉబ్బిపోయి శ్వాస కష్టంగా మారుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- పొగమంచు బారిన పడకుండా ఉండడానికి ఉదయం మాస్కులు ధరించాలి.
- మధుమేహం, గుండెజబ్బు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి. శరీరం పొడిబారకుండా తడిగా ఉండేలా చూసుకోవాలి.
- దగ్గు, జలుబు, జ్వరం, ఉంటే ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకోవాలి. వైద్యుల సలహా మేరకు వైరస్‌ను నియంత్రించే వ్యాక్సిన్‌ను వేయించుకోవాలి.
- గోరు వెచ్చని నీటితో స్నానం చేయాలి. బాగా వేడిగా ఉన్న నీరు వాడకూడదు.
- వాహనాలు నడిపే వారు చేతులకు గ్లౌజ్‌లు వేసుకోవాలి. పొగతాగేవారికి దూరంగా ఉండాలి.
- ఏసీ గదుల్లో, చల్లటి గాలి తగలకుండా చూసుకోవాలి. జ్వరం దగ్గు, జలుబు వంటి సమస్యలుంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి.

కాచి చల్లార్చిన నీటిని తాగాలి



శ్వాసకోశ, ఈఎస్‌టీ సమస్యలు ఉన్నవారు చలికాలంలో జాగ్రత్తగా ఉండాలి. కాచిచల్లార్చి వడపోసుకున్న నీటిని తాగాలి. వెచ్చని దుస్తులు ధరించాలి. శరీరం పూర్తిగా కప్పి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. చల్లటి పానీయాలు, ఫ్రీజ్ నీరు తాగొద్దు. పౌష్టికాహారం తీసుకోవాలి. చిన్న పిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలి.

–డాక్టర్ శ్రీనివాస్ వద్దే, జనరల్, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్

భక్తిభావంతో సన్మార్గం

మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి



పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్: ప్రతిఒక్కరూ భక్తి భావం పెంపొందించుకుంటే సన్మార్గం అలవడుతుందని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని దోడిగడ్డ తండాలో నూతనంగా నిర్మించిన శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవాలయాలు సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలు నిలుస్తున్నాయని అన్నారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుగుణ రవి నాయక్, మాజీ ఎంపీపీ బుజ్జి బాబు నాయక్, శివశంకర్‌గౌడ్, మంగ్యా నాయక్, ఆనంద్ నాయక్, తేజా నాయక్, దేశ్యా, కుమార్ నాయక్, వేణు నాయక్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో వాటర్ ట్యాంకు

పట్టించుకోని అధికారులు



అపరిశుభ్రంగా తయారైన వాటర్ ట్యాంకు

కొత్తూరు: మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామ శివారులోని ప్రఖ్యాతి గాంచిన హజ్రత్ జహంగీర్ పీర్ దర్గా ఆవరణలో కొన్నేళ్ల క్రితం నిర్మించిన తాగు నీటి ట్యాంకు అపరిశుభ్రంగా మారింది. అక్కడ ముళ్ల చెట్లు, గడ్డి పెరిగి శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ట్యాంక్ తయారైంది. దర్గా దర్శనం కోసం వచ్చే భక్తులు దర్శనం అనంతరం ట్యాంకు పరిసరాల్లో సేద తీరుతుంటారు. అక్కడ వారికి ఏ క్షణాల్లో ఏం జరుగుతుందో స్థానికులు, భక్తులు ఆందోళనకు గురవుతున్నారు. ఇక్కడి ట్యాంకు నుంచి సిమెంట్ పెచ్చులు ఊడి ప్రమాదకరంగా మారింది. ఈ విషయాన్ని పట్టించుకునే వారు కరువయ్యారు. ఈదురు గాలులు, వర్షాలు కురిస్తే ట్యాంకు కూలిపోయే ప్రమాదం ఉంది. గతంలో స్థానికులు పలుమార్లు ఈ ట్యాంకును కూల్చివేయాలని అధికారులకు విన్నవించినా ఎలాంటి ఫలితం లేదని స్థానికులు, దర్గాకు వచ్చే భక్తులు వాపోయారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి దర్గా ఆవరణలో ఉన్న ట్యాంకును కూల్చి మరో ట్యాంకు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డుపై కంకర.. ఆదమరిస్తే అంతే!

ప్రమాదకరంగా రహదారి



కంకర తేలిన కలెక్టర్ కార్యాలయ రోడ్డు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల నుంచి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఇది నెహ్రూ ఔటర్ రింగు రోడ్డుకు అనుకొని ఉండటంతో ఈ ప్రాంతంలో కాంక్రీట్ మిక్స్‌డ్(ఆర్ఎంసీ) కేంద్రాలు ఉన్నాయి. నిత్యం కంకర, డస్టు వాహనాలు రావడంతో రహదారి వెంబడి దుమ్ము ధూళి దర్శనమిస్తోంది. వాటి అవశేషాలు రోడ్డుపై పడడంతో తరచూ వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ మార్గంలో జిల్లా కలెక్టర్‌తో పాటు, ఉన్నత స్థాయి అధికారులు ప్రయాణం చేయడం గమనార్హం.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

మీర్‌పేట: మరమ్మతుల కారణంగా 11కేవీ టీఆర్ఆర్ టౌన్‌షిప్ ఫీడర్ పరిధిలోని కాలనీలలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మీర్‌పేట ఏఈ ఎస్.ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హనుమాన్‌నగర్, గుడ్‌లైఫ్ స్కూల్, పల్లవినగర్, ఆర్టీసీకాలనీ, టెలిఫోన్‌కాలనీ, మారుతీనగర్, రాఘవేంద్రనగర్, గౌతమీనగర్, ఆదిత్యనగర్, టీఆర్ఆర్ టౌన్‌షిప్, ఆదర్శనగర్ కాలనీల పరిధిలో విద్యుత్‌ను నిలిపి వేయనున్నట్లు ఆయన చెప్పారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో సోమవారం (నేడు) ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ పీఆర్ఓ పాషా ఓ ప్రకటనలో తెలిపారు. శిబిరంలో కంటి చూపు మందగించిన వారికి ఉచితంగా కంటిపరీక్షలు నిర్వహిస్తామని అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు. రోగులు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు తీసుకుని రావాలని సూచించారు. శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని వేంకటగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల సందర్భంగా వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. అర్చకుడు గూడ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, తులసీదళ అర్చన, తిరుప్పావై, ప్రబంధ విన్నపం, నక్షత్రహారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అన్యాయం చేస్తే ఊరుకోం

యాచారం: రైతుబంధు నిధులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పాశ్ఛ భాషా డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పట్టాదారు, పాసు పుస్తకాల్లో పేర్కొన్న ఎకరాలకు మొత్తం రైతుబంధు నిధులు ఇవ్వాల్సిందేనని అన్నారు. రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోమని హెచ్చరించారు.

మలుపు.. రక్షణ చర్యలేవి

- ఏర్పాటుకు నోచుకోని సూచిక బోర్డులు
- పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో వాహనదారులు



ప్రమాదకరంగా మలుపు

కొత్తూరు: మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లలోని మూల మలుపుల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని పట్టించుకునే అధికారులు కరువయ్యారు. ఇక్కడ మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు, స్థానికులు చెబుతున్నారు. అయినప్పటికీ ప్రమాదకర మలుపులను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పెంజర్ల నుంచి సిద్ధాపూర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డులో పెంజర్ల జెడ్పీహెచ్ఎస్ ఎదురుగా ఉన్న మలుపు ప్రమాదాలకు నిలయంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించిన వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నట్లు పేర్కొంటున్నారు. ఇప్పటికైన సంబంధితశాఖ అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సృజనాత్మకతతో మెరుగైన ఫలితాలు

సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం



ప్రదర్శనను తిలకిస్తున్న బీఆర్ఎస్ యువ నాయకుడు కార్తీక్ రెడ్డి

పహాడీషరీఫ్: విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు దోహదపడతాయని బీఆర్ఎస్ యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ షాహీన్ నగర్‌లోని జామియా దారుల్ హుదా హైస్కూల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు బాల్యం నుంచే ప్రాక్టికల్స్ విద్యావిధానంపై అవగాహన కల్పించడం ద్వారా ఆలోచన శక్తిని పెంచినట్లవుతుందన్నారు. దాదాపు 150 మంది విద్యార్థులు ప్రదర్శనలో ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్ యూసుఫ్ పటేల్, శంషూద్దీన్, మేరాజ్ ఖాన్, సయ్యద్ అబ్దుల్ రవూఫ్, సయ్యద్ ఫెరోజ్, మజ్హర్ అలీ, బర్కత్ అలీ, అలీ మసూరీ తదితరులు పాల్గొన్నారు.

రామానుజన్ సేవలు అమోఘం



ఆల్ఫోర్స్ మ్యాథ్స్ టెస్ట్‌కు హాజరైన విద్యార్థులు

హుడాకాంప్లెక్స్: భారతదేశ గణిత శాస్త్ర అభివృద్ధికి నూతన అధ్యాయాన్ని కనుగొన్న మహనీయుడు శ్రీనివాస రామానుజన్ అని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి కొనియాడారు. ఘట్‌కేసర్, సరూర్‌నగర్, కర్మన్‌ఘాట్, నల్లకుంట, గుర్రంగూడ, సుచిత్ర, అల్వాల్‌లో ఆల్ఫోర్స్ మ్యాథ్స్ ఒలింపియాడ్ టెస్ట్ నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. చిన్ననాటి నుంచే రామానుజన్ గణితశాస్త్రం పట్ల చాలా దృష్టి వహించేవారని, అదే ఆసక్తిని క్రమక్రమేనా పెంపొందించుకున్నారన్నారు. పలు శాస్త్రవేత్తలు చేపట్టినటువంటి పరిశోధనలకు ఆకర్షితులై ప్రత్యేకంగా గణిత శాస్త్రంలో నూతన విషయాలకు బీజం వేశారన్నారు. అనంతరం రాష్ట్రంలోని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల్లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు సుమారు 1200 మందికి పరీక్ష నిర్వహించామన్నారు.

ఉద్యోగులకు బదిలీ సాధారణమే

ప్రజల మన్ననలు పొందాలి ● ఎస్ఐ బీఎస్ఎస్ వరప్రసాద్



ఆరిఫ్‌కు వీడ్కోలు పలుకుతున్న సిబ్బంది

కేశంపేట: ఉద్యోగులకు బదిలీ సర్వ సాధారణమేనని, ఎక్కడ ఉద్యోగం చేసినా ప్రజల మన్ననలను పొందాలని ఎస్ఐ బిఎస్ఎస్ వరప్రసాద్ అన్నారు. కేశంపేట పోలీస్‌స్టేషన్‌లో 5సంవత్సరాలుగా కానిస్టేబుల్ విధులు నిర్వహించిన ఆరిఫ్ హెడ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగ ఉన్నతి రావడంతో హైదరాబాద్‌లోని మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఆరిఫ్‌కు వీడ్కోలు నిర్వహించారు. అనంతరం పూలమాల వేసి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆరిఫ్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎక్కడ పనిచేసినా నిబద్ధతతో పనిచేయాలని తోటి సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ నర్సింలుశెట్టి, భీంరాజ్, శివలింగం, రవి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్నదానం



షాద్‌నగర్: అన్నదానం చేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి, ప్రేమశ్రీ దంపతులు



షాబాద్: స్వాములకు అన్నం వడిస్తున్న డాక్టర్ ముస్తఫా

షాద్‌నగర్: పట్టణంలో ఎల్ఎన్ కాలనీలోని శ్రీ శివ మారుతీ గీతా అయ్యప్ప మందిరంలో ఆదివారం పట్టణానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి, ప్రేమశ్రీ దంపతులు స్వాములకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గురుస్వామి గిరీషన్ నాయక్ అయ్యప్ప స్వాములకు ఇరుముడులు కట్టారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గోలెపు చంద్రశేఖర్, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు విశ్వం, మంజు శ్రీ, రాఘవేందర్, వెంకట్‌రాంరెడ్డి పాల్గొన్నారు.

షాబాద్‌లో..

షాబాద్: డాక్టర్ ముస్తఫా అయ్యప్ప స్వాములకు అన్నదానం చేసి మతసామరస్యాన్ని చాటి చెప్పారు. హిందూ, ముస్లింలు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొంటే మతసామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని వారు తెలిపారు. గురుస్వాములు దర్పల్లి రవీందర్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, చంద్రయ్య, వెంకటేష్‌గుప్తా, మల్లేశ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్ రూరల్: కనకమామిడి అయ్యప్పదేవాలయంలో పూజలో స్వాములు, పూజారులు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని కనకమామిడి అయ్యప్ప దేవాలయంలో వార్షికోత్సవం వేదపండితులు, పూజారులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప సన్నిధానంలో గోపూజ, గణపతి పూజ, పుణ్యవసనం తదితర పూజలు చేశారు. గురు స్వాములు సుదర్శన్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రామిరెడ్డి, అయ్యప్ప స్వాములు మర్రి మల్లారెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రారంభమైన ధనుర్మాసం

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు జనవరి 15వ తేదీ వరకు కొనసాగుతాయి. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ కాడమోని శ్రీశైలం ఉత్సవాల నిర్వహణ కోసం రూ.15 వేలు ఆర్థిక సాయాన్ని ఆలయ అర్చకులకు అందజేశారు. ఆలయంలో అర్చన, మహా నివేదన, హారతి, తిరుప్పావై ప్రవచనములు, తీర్థ ప్రసాద వితరణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు రామాచారి, పద్మనాభం, భక్తులు పాల్గొన్నారు.

కడ్తాల్: కడ్తాల్‌కు చెందిన జంగయ్య ఆదివారం ఉదయం మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ పరామర్శించారు. అనంతరం మండల పరిధిలోని సాలార్‌పూర్ గ్రామంలో మృతి చెందిన వరుణ్ కుటుంబ సభ్యులను కూడా పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. పరామర్శించిన వారిలో ఎంపీటీసీ ప్రియా రమేశ్, మాజీ ఎంపీపీ సువాలి పంతునాయక్, మాజీ ఎంపీటీసీ సాయిలు, నాయకులు శంకర్, బాబా, జగన్, చంద్యా, జైపాల్, బన్సీలాల్ ఉన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న జెడ్పీటీసీ